

విద్యార్థులతో మాట్లాడుతున్న పాఠశాల ప్రిన్సిపాల్ జోసఫ్‌రెడ్డి

### అయ్యప్పమాల వేసుకున్న విద్యార్థిని
## బయటకు పంపిన ప్రిన్సిపాల్

**విద్యార్థి సంఘాల ఆందోళన**

జనగామ రూరల్, డిసెంబర్ 2 : అయ్యప్పమాల వేసుకున్న విద్యార్థిని పాఠశాల బయట నిలబెట్టిన సంఘటన జిల్లా కేంద్రంలోని సెయింట్‌పాల్ పాఠశాలలో శనివారం చోటుచేసుకుంది. తల్లిదండ్రులు తెలిపిన ప్రకారం.. జనగామలోని నెహ్రూపార్క్ వద్ద ఉన్న సెయింట్‌పాల్ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న ఐటికాల ఏకవర్ధన్ అయ్యప్పమాల ధరించాడు. అయ్యప్పమాల ధరించిన నాటి నుంచి పాఠశాలకు వస్తున్న విద్యార్థిని శనివారం రోజు క్లాస్‌రూం బయట నిలబెట్టారు. ఎందుకు నిలబెట్టారని తల్లిదండ్రులు అడిగితే అయ్యప్పమాల ధరించడం వల్ల బయట నిలబెట్టామని, పాఠశాల డ్రెస్ వేసుకొని రావాలని తెలిపినట్లు తల్లిదండ్రులు చెప్పారు. విషయం తెలుసుకున్న బీజేపీ, విద్యార్థి సంఘాలు పాఠశాలకు చేరుకున్నాయి. నిరసన తెలుపడంతోపాటు ప్రిన్సిపాల్ చాంబర్‌ను ధ్వంసం చేశారు. పాఠశాలకు చేరుకున్న సీఐ విద్యార్థి సంఘాలతోపాటు ప్రిన్సిపాల్‌తో మాట్లాడారు. విద్యార్థి మాల వేసుకోవడంతో తోటి విద్యార్థుల కాళ్లు తాకుతున్నాయని మాత్రమే అతన్ని బయట కూర్చోబెట్టామని తెలిపారు. బయట కూర్చోవడం వల్ల ఇబ్బంది అయితే క్షమించాలని తెలిపారు.

### ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి

**ఎన్నికల రిటర్నింగ్ అధికారి రామ్మూర్తి**

స్టేషన్ ఘన్‌పూర్, డిసెంబర్ 2 : గురువారం జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో వాసం రామ్మూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జనగామ జిల్లాలోని పెంబర్తిలో గల విద్యాభారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో ఆదివారం 8గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమవుతుందని, ఇందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,49.155మంది ఉండగా 290పోలింగ్ బూతులలో ఓటింగ్ నిర్వహించినట్లు తెలిపారు. 2,18,484 ఓట్లు పోలయ్యాయని, ఈ ఓట్ల లెక్కింపులో 150 సిబ్బందితో 14టేబుల్స్, 21రౌండ్లలో లెక్కింపు ప్రక్రియ జరుగనుందని ఆయన తెలిపారు.




మాట్లాడుతున్న వాసం రామ్మూర్తి

### అంబులెన్స్‌లో గర్భిణి ప్రసవం

దేవరుప్పుల, డిసెంబర్ 2 : దొనెబండ తండాకు చెందిన లకావత్ వెన్నెల నిండు గర్భిణి. శనివారం ఆమెను ప్రసవం కోసం కుటుంబ సభ్యులు అంబులెన్స్‌లో జనగామ లోని ఎంసీహెచ్ దవాఖానకు తరలిస్తుండగా నొప్పులు అధికమయ్యాయి. దీంతో అంబులెన్స్‌లో ఈఎంటీ మల్లేశ్ ప్రసవం చేశారు. వెన్నెల పండంటి మగ బిడ్డకు జన్మనివ్వగా తల్లీపిల్లలు క్షేమంగా ఉన్నారు. వారిని ఆరోగ్య పరీక్షల నిమిత్తం జనగామ జిల్లా కేంద్రంలోని మాతా శిశు సంరక్షణా కేంద్రానికి తరలించారు. సుఖ ప్రసవం చేసిన ఈఎంటీ మల్లేశ్‌ను, పైలెట్ అజీజ్‌పాషాను స్థానికులు అభినందించారు.



శిశువుతో వెన్నెల కుటుంబ సభ్యులు, సిబ్బంది

# అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం

- నర్సంపేట ఎన్నికల అధికారి కృష్ణవేణి
- నేడే ఓట్ల లెక్కింపు
- సర్వం సిద్ధం చేసిన అధికారులు



కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న నర్సంపేట ఎన్నికల అధికారులు

నర్సంపేట, డిసెంబర్ 2: నర్సంపేట శాసనసభ ఓట్ల లెక్కింపును వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లను పూర్తి చేసినట్లు నర్సంపేట ఎన్నికల అధికారి కృష్ణవేణి తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు ఆదివారం ఉదయం 8 గంటలకు ప్రారంభం అవుతుందన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థుల ఏజెంట్లకు అవసరమైన గుర్తింపు కార్డులు అందజేసినట్లు వెల్లడించారు. మొదట పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ఉంటుందని, అనంతరం ఈవీఎంల ఓట్లు లెక్కిస్తారని వివరించారు. నర్సంపేట నియోజకవర్గంలో 87.87 శాతం పోలింగ్ నమోదైనట్లు చెప్పారు. మొత్తం 2,32,179 మంది ఓటర్లకు 2,04011 మంది తమ ఓటుహక్కు వినియోగించుకున్నారని తెలిపారు. పటిష్ట భద్రతా నడుమ ఓట్ల లెక్కింపు ఉంటుందని స్పష్టం చేశారు. కాగా, ఆర్వో కృష్ణవేణి ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూంలు, ఏర్పాట్లను ఎన్నికల అబ్జర్వర్ అనిల్ రామకృష్ణతో కలిసి పరిశీలించారు. జిల్లా పరిధి మాస్టర్ ట్రైనర్ పట్టాభితో కౌంటింగ్‌లో అనుసరించాల్సిన నియమ నిబంధనలపై కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ ఇప్పించారు. ఓట్ల లెక్కింపు కోసం 14 టేబుళ్లు ఏర్పాటు చేశామన్నారు. నర్సంపేట నియోజకవర్గంలోని ఓట్ల లెక్కింపును 21వ రౌండ్లలో నిర్వహించనున్నట్లు తెలిపారు. కౌంటింగ్ హాళ్లలోకి మొబైళ్లు నిషేధమన్నారు. ఒక్కో టేబుల్‌కు ముగ్గురు చొప్పున మొత్తం 42 మంది ఉంటారని వివరించారు. వారిలో మైక్రో అబ్జర్వర్లు, కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు ఉన్నట్లు వెల్లడించారు. ఆమె వెంట నర్సంపేట, నల్లబెల్లి తహసీల్దార్లు విశ్వప్రసాద్, రాజేశ్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

## నేడు ఎనుమాముల వద్ద 144 సెక్షన్

కాశీబుగ్గ, డిసెంబర్ 2: వరంగల్ 14వ డివిజన్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ పరిధిలో వరంగల్ తూర్పు, పశ్చిమ, వర్ధన్నపేట, నర్సంపేట, పరకాల నియోజకవర్గాల కౌంటింగ్ ఉన్నందున చుట్టుపక్కల 144 సెక్షన్ అమల్లో ఉంటుందని మామునూరు ఏసీపీ సి.సతీశ్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్కెట్‌లోకి జిల్లా రెవెన్యూ అధికారులు, జిల్లా పోలీస్ అధికారులు, అభ్యర్థులు, వారి ఏజెంట్లు, మున్సిపల్ సిబ్బంది, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులకు మాత్రమే అనుమతి ఉందని స్పష్టం చేశారు. మార్కెట్‌లోకి సామాన్య ప్రజలకు అనుమతి లేదని, పరిసరాల్లో ఎవరూ గుమికూడొద్దని సూచించారు. అలాగే, ఎలాంటి విజయోత్సవ ర్యాలీలకు అనుమతిలేదని పేర్కొన్నారు. గేట్ నంబర్–2 నుంచి లోనికి ప్రవేశం ఉందని, అభ్యర్థులు, పోలింగ్ కౌంటింగ్ స్టాఫ్, ఏజెంట్లు, పాత్రికేయులు గమనించాలని కోరారు. వారి వెంట తెచ్చుకున్న వాహనాలను మార్కెట్ పరిధిలోని పత్తి, మిర్చి, పల్లి యార్డుల్లో పార్కింగ్ చేసుకోవాలని సూచించారు. అలాగే, కౌంటింగ్ హాల్‌లో సెల్‌ఫోన్లకు అనుమతి లేదన్నారు. కాశీబుగ్గ నుంచి మొగిలిచెర్లకు వెళ్లే సామాన్య ప్రజల వాహనాలు బాలాజీనగర్ జంక్షన్ నుంచి వంద ఫీట్ల రోడ్డు ద్వారా నర్సంపేట మెయిన్‌రోడ్డు వైపు నుంచి వెళ్లాలని కోరారు. అలాగే, రెడ్డిపాలెం జంక్షన్ నుంచి వచ్చే వాహనదారులు గొర్రెకుంట మీదుగా వెళ్లాలని సూచించారు. 144 సెక్షన్ అమల్లో ఉన్నందున ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని ఏసీపీ హెచ్చరించారు.

### వరంగల్‌లో అయ్యప్పస్వాములకు నిత్యాన్నదానం

కాశీబుగ్గ, డిసెంబర్ 2: వరంగల్ 19వ డివిజన్ ఓసిటీ రోడ్డులోని శ్రీసీతారామాంజనేయ హరిహరపుత్ర అయ్యప్పస్వామి శివపంచాయతన ఓంకారేశ్వర నాగేంద్రస్వామి ఆలయంలో అయ్యప్ప స్వాములకు నిత్యాన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. జనవరి 5వ తేదీ వరకు నిత్యం మధ్యాహ్నం 12.30 గంటలకు దాతలు, అయ్యప్పస్వాములు, భక్తుల సహకారంతో అన్నదానం చేస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే, ఈ నెల 10న పంబారొట్టు, 18న సుబ్రమణ్యస్వామి కల్యాణోత్సవం, 27న అయ్యప్పస్వామి మహపడిపూజ, జనవరి 3న కలశపూజ నిర్వహించనున్నట్లు వివరించారు. దాతలు 9700485111, 92937 01910, 9848294028, 9951890637 ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుల నంబర్లలో సంప్రదించాలని కోరారు.



సీతారామాంజనేయస్వామి ఆలయం

### వైన్ షాపుల వద్ద బారులుతీరిన మద్యం ప్రియులు

స్టేషన్ ఘన్‌పూర్, డిసెంబర్ 2 : వైన్ షాపుల వద్ద శనివారం మద్యం ప్రియులు బారులుతీరారు. ఎన్నికల కోడ్ నిబంధనలో భాగంగా గత నెల 28సాయంత్రం నుంచి 30వ తేదీ సాయంత్రం వరకు మద్యం షాపులు మూసివేశారు. దీంతో మద్యం కోసం మద్యం ప్రియులు కొంత వరకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కాగా, మద్యం టెండర్లలో షాపులు పొందిన వారు కొత్తగా డిసెంబర్ ఒకటి తేదీ నుంచి నూతన షాపులను ప్రారంభించారు. ఆదివారం(నేడు) ఓట్ల లెక్కింపు ఉన్న కారణంగా శనివారం ఉదయం నుంచే మద్యం కోసం మద్యం ప్రియులు షాపుల ముందు బారులుతీరారు.



మద్యం షాపుల ముందు బారులుతీరిన మద్యం ప్రియులు

### విజయోత్సవ ర్యాలీలు, సభలు నిషేధం

నర్సంపేట, డిసెంబర్ 2: నేడు తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఎన్నికల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో ఎలాంటి విజయోత్సవ ర్యాలీలు, విజయోత్సవ సభలు నిర్వహించొద్దని నర్సంపేట ఏసీపీ తిరుమల్ సూచించారు. ఎన్నికల నియమావళి, 144 సెక్షన్ అమల్లో ఉన్నందున నర్సంపేట నియోజకవర్గ ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఫలితాలు వెలువడే క్రమంలో పటాకులు కాల్చడం, డీజే సౌండ్స్ పెట్టొద్దని, సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టొద్దని, గుంపులుగా తిరుగొద్దని, బైక్, ఇతర ర్యాలీలు నిర్వహించకూడదని సూచించారు. అలాగే, గెలిచిన అభ్యర్థులు, కార్యకర్తలు, అభిమానులు ఓడిపోయిన అభ్యర్థులు, కార్యకర్తల ఇండ్ల ఎదుట ఎలాంటి కవ్వింపు చర్యలకు పాల్పడొద్దని హెచ్చరించారు. కోడ్‌ను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

### అనారోగ్యంతో కళాకారుడి మృతి

నర్సంపేట, డిసెంబర్ 2: పట్టణానికి చెందిన తెలంగాణ పద్యనాటక ఉత్తమ అవార్డు గ్రహీత, కళాకారుడు శ్రీరామోజు భిక్షమాచారి(80) అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. నర్సంపేటకు చెందిన ఆయన చిన్ననాటి నుంచి రంగస్థల కళాకారుడిగా మంచి పేరు తెచ్చుకున్నారు. పౌరాణిక, సాంఘిక నాటకాలు వేస్తూ అద్భుత ప్రతిభ కనబర్చారు. కళారంగంలో ఆయన పలు అవార్డులు అందుకున్నారు. భిక్షమాచారి మృతిపై కళాకారులు, స్వర్ణకారుల సంఘం, సీనియర్ సిటిజన్లు, నాయకులు సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.

### వృద్ధుడి ఆత్మహత్య

చెన్నారావుపేట, డిసెంబర్ 2: వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన బోజెర్వు గ్రామంలో శనివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రాధారపు గౌరయ్య(70) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆరోగ్యం బాగా లేకపోవడం, ఇతర సమస్యల కారణంగా కొంతకాలం నుంచి మానసికంగా కుంగిపోతున్నాడు. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన గౌరయ్య శుక్రవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతడి కుమారులు, బంధువులు వెతుకగా, తన పొలం వద్ద శనివారం ఉదయం చెట్టుకు వేలాడుతూ మృతదేహం కనిపించింది. యాకయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తోట మహేందర్ తెలిపారు.


### 9న కిట్స్‌లో 39, 40 ఎన్యువల్ గ్రాడ్యుయేషన్ డే

హసన్‌పర్తి, డిసెంబర్ 2: ఎర్రగట్టుగుట్ట కిట్స్ కళాశాలలోని ప్లే పిట్స్‌లో ఈ నెల 9న 39, 40 ఎన్యువల్ గ్రాడ్యుయేషన్ డే నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ అశోక్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం 2018–22, 2019–23 సంవత్సరం బ్యాచ్ విద్యార్థులు 39, 40వ గ్రాడ్యుయేషన్ డేకు సంబంధించిన ఆహ్వాన పత్రికను ప్రిన్సిపాల్ ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా హైదరాబాద్‌కు చెందిన (ఎల్‌టీఐ మైండ్ ట్రీ కంపెనీ) వైస్ ప్రెసిడెంట్, గ్లోబెల్ హెడ్ ఎంటర్‌ప్రైజ్ క్లౌడ్ యాప్స్, సేల్స్ ఫోర్స్ అమర్‌నాథ్ జూలూరి హాజరు కానున్నట్లు చెప్పారు. అలాగే, 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించిన వివిధ విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 14 మందికి బంగారు పతకాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కోమల్‌రెడ్డి, రాజగోపాల్, పీఆర్వో ప్రభాకరాచారి పాల్గొన్నారు.

# ప్రచార ఖర్చులు చెల్లించని జీవీఆర్

**ఏసీపీకి ఫిర్యాదు చేసిన బీజేపీ శ్రేణులు**

స్టేషన్ ఘన్‌పూర్, డిసెంబర్ 2 : ఎన్నికల ప్రచారంలో తన వెంట తిప్పుకుని, ఎన్నికలు ముగిసినప్పటికీ ప్రచారంలో ఉపయోగించుకున్న వాహనాల ఖర్చులు ఇవ్వడం లేదని, ఆ డబ్బులు ఇప్పించాలని బీజేపీ మండల అధ్యక్షుడు గట్టు కృష్ణ శనివారం ఏసీపీకి ఫిర్యాదు చేశారు. స్టేషన్ ఘన్‌పూర్ బీజేపీ అభ్యర్థిగా మాజీ మంత్రి గుండె విజయ రామారావును ఆ పార్టీ అధిష్ఠానం ప్రకటించింది. ఈ నేపథ్యంలోని యోజకవర్గంలోని వివిధ మండలాల అధ్యక్షులతో బీజేపీ అభ్యర్థి గుండె విజయరామారావు (జీవీఆర్) మాట్లాడారు. మీరు వాహనాలు పెట్టుకుని ప్రచారం చేయండి.. వాహనాల ఖర్చు, ఇంధనం ఖర్చు చెల్లిస్తానని చెప్పడంతోపాటు వాహనాలకు ప్రచార అనుమతులు ఇప్పించారు. దీంతో బీజేపీ శ్రేణులు నియోజకవర్గంలో వాహనాల్లో తిరిగి ప్రచారం నిర్వహించారు. ఎన్నికలు ముగిసే నాటికి అయిన ఖర్చులలో సగం వరకు మాత్రమే చెల్లించారని, మిగతా డబ్బులు చెల్లించమని జీవీఆర్‌ను కోరితే బీజేపీ నియోకవర్గ కన్వీనర్ అంజిరెడ్డిని అడగమంటూ ఇలా ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని వారు పేర్కొన్నారు. అంతేకాకుండా వాహనాల యజమానులకు ఫోన్ చేసి మండల అధ్యక్షులకు వాహనాల కిరాయి డబ్బులు పూర్తిగా చెల్లించామని, వారిని అడుక్కొమ్మని వారికి చెబుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో వాహన యజమానులు కిరాయి డబ్బులు చెల్లించాలంటూ తమను ఒత్తిడి చేస్తున్నారని, జీవీఆర్ నుంచి కానీ, అంజిరెడ్డి వద్ద నుంచి కానీ మా డబ్బులు మాకు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని ఏసీపీకి ఫిర్యాదు చేసినట్లు బీజేపీ మండల అధ్యక్షుడు తెలిపారు.



ఫిర్యాదు కాపీ